# ఇది ఇట్లుందమ్మో...

ఛా త్తెరి నీయమ్మ ఇంక పండు కున్నావ్ లేవేందిరా లం... కొడక?

ఊఁ! సలిపెడ్తుందే నాయన ఉ...

చినుగుల దుప్పట్లో శరీరాన్ని ముడుచుకొని చలిని తట్టుకోవడానికి ప్రయత్నిస్తున్న చిన్ని రాజి గాడు అయ్యని కొరకొరా చూస్తూ లేచి కూర్చున్నాడు.

కోడయినా కూయక ముందే తన నిద్ర చెడగొట్టి నందుకు వాడికి తండ్రి పై కావాల్సినంత కోపం, పదకొండు సంవత్సరాలు నిండిన రాజిగాడికి రోజూ అదే విధంగా ప్రారంభమయ్యే ఉదయమంటే ఎక్కడలేని కోపం, రాత్రి నిదురపోయేముందు ప్రతి రోజూ ఉదయం రాకుండా ఉంటే బాగుంటుందని పరిపరి విధాలుగా కోరుకుంటాడు దేవుండ్లనందరిని. అయినా ఫలితం ఉండదు.



ఆ సలిపెడ్తున్నాదిరా కొడక, ఏం దొరోల్ల బిడ్డడనుకున్నావ్ సలిపెడ్తుందం టన్నవ్ ఈడ నువ్వు పండుకుంటె నీ పెండ్లికి దెచ్చిన అప్ప ఎవరు దీరు స్తరమ్మన్నవ్, నీ అమ్మను పండ బెట్టనా? తిట్ల వర్షం ప్రారం భమయ్యింది పోసాని నోటి నుండి.

చినుగుల దుప్పటిని చుట్టి గుడిసెలోని ఒక మూల ఉంచి ఊడిపోయిన గోచి సరిగా కట్టుకొని బయటికి నడిచాడు చిన్ని రాజిగాడు.

'కుక్కురూకో...' తొలి కూత వినిపించింది.

జనవరి మాసం గజగజా వణుకు పుట్టిస్తుంది చలి. చంబు పట్టుకుని నడవడం ప్రారంభించాడు.

నోటి వెంటవదుల్తున్న గాలి పొగలా కనిపిస్తుంటే మహా తృప్తి పడుతూ దానివంక చూసుకుంటూ ఆనందంగా నవ్వుకుంటున్నాడు. "పటేల్ కొడుకు రాజ లెక్క నేను గూడ తెల్లారినాక లేసి ఆసన సబ్బు తోని తానం జేసిన నంట, ఇస్త్రీ బట్టలేసుకొని, బూట్లు తొడుక్కొని సయిలు పట్టుకోని టక్కుటక్కుమని బడికి పోతున్న నంట, అందరు నన్ను రాజుగా అనిగాక రాజు అని పిలుస్తున్నరంట.

ఆ ఇంకేమయ్యింది? రాజుగాడు చెబుతున్న రాత్రి కలని ఆసక్తిగా వింటున్న లింగడు అడిగాడు.

ధూసి నాకేం ఎర్క ఇష్కూల్ గంట గన గన మంటుండంగనే మా అయ్య బాగోతం మొదలు బెట్టిండు.

కొంత సేపు నిశ్శబ్దం.

కోరికలు తీరని ఆత్మల సంగతి సరిగా తెలియదు కాని మనుషుల మనసులు మాత్రం కలల చుట్టూ పరిభ్రమించడం సర్వసాధారణం. రాజిగానికి అయ్య మీద

కోపం, ఏం అడిగినా సరిగా జవాబు చెప్పడు, గట్టి గడిగితె తిడ్తడు, ఇంక గట్టి గడిగితే కొడ్తడు.

గుడిసెకి తిరిగొచ్చిన కొడుకును జూసి ఇంక పోక పోతేందిఏరా రాజిగా, దొరోల్లు ఏన్న నీ అయ్యను దిట్టిన్రంట. బేగిన అర్తంలేవని అంటున్నది రాజిగాని తల్లి లచ్మి, ధనలక్ష్మి, ఆరోగ్యలక్ష్మి, ఆనందలక్ష్మి... ..., లాంటి లచ్చులు ఎవరూ తనతో లేకపోయినా పేరు మాత్రం లచ్మే.

'అయ్య పొయ్యిండా చెరువుకి?'

వేరెటోడు పొద్దు గుంకిందన్క ఇంట్ల కూకుంటె చిక్కగున్నోలు ఊరుకుంటారు. ఆల్ల పంటలు బాగ పండాల్నంటే కాలమంత మీ అయ్యమీదంగనే పోవాలి. నువ్వు పోతున్నవా లేదారా? అడిగింది తల్లి.

'ఏహె పోతున్నాగు' రాజిగాడు ఆ రోజు ప్రస్తావం ప్రారంభించాడు. ఊర్ల ఉన్న పొలాలు పచ్చంగ కనిపియ్యాల్నంటే చెరువుల్లో నీల్లు ఆ పొలాల్లోకి పోవాలె, అవి పొలాల్లోకి పోవాలంటే వేరెటోడు పని పక్కాంగ జెయ్యాలి. పనిల తిక్కర్ మక్కరయితె ఊరోల్లు వేరెటోన్నే పడ్తరు, పని బాగా జేసిన గూడ ఆల్లు, ఆల్లు పార్టీలు గట్టి వేరెటోల్లని ఇరికిస్తరు, పొట్టు పొట్టు కొడ్తరు. అయిన అడిగెటోల్లుండరు: ఇది ఇట్లెందుకయితది ప్రశ్న ప్రతిరోజు రాజిగాని బుర్రలో తిరుగుతుండేది.

ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతుంది.

అయ్యను గినక అడిగితె 'ఊకోర తిక్కలోడ మన రాత ఇట్లున్నది ఆల్ల రాత అట్లున్నది' అంటడు.

రాతంటే ఏందే? ఎవరు రాస్తరు అనడిగితె నొసటి రాత దేవుడు రాస్తడని చెబుతడు.

కొందరు దేవుండ్లతానికి తానం జెయ్యకుండా పోవద్దంటరు, నీసు ముడ్తె దేవుడు శాప మిస్తడంటరు. ఇంకొంతమంది దేవుండ్లు పుంజుల్ని, మేకల్ని బలి ఇయ్యకుంటే ఊకోరు, సారగీర నైవేద్యం లేకుంటె కలల కొచ్చి తిడ్తరు. ఈ దేవండ్లల్ల తేడా ఎందుకుంటదో తెలియదు, నొసటిరాత రాసేడ్డి ఏ దేవుడనుకోవాల్నో తెలియదు. ప్రతిరోజులాగే ప్రశ్నల పరంపర రాజిగాడి బుర్రలో తిరుగుతుంది.

ఓర్లంబకొడ్క తెల్లార్లేదింక మా రాజులెక్క వస్తు



న్నవు నడుస్ బిరబిర, పొద్దెక్కివంకొస్తె ఎవర్జేస్తరముకున్నవ్ నీ పనిని నీ పెండ్లాం... కాపోని నాట్ల కూతలు ఎప్పుడూ జరిగేవే.

పనులన్నీ చాల క్రమంగా జరిగిపోతున్నాయి.

శరీరంలోని అవయువాలన్నీ కదులుతున్నాయి, మెదడు నుండి ఎటువంటి ఆర్డర్ లభించకపోయినా అవి తమ పనిని చేస్తున్నాయి.

పశువుల పాక నుండి పేడ తీయడం మొదలు

రాత్రి నుండి పడి వున్న పేడపైన రకరకాల ఈగలు ఝుమ్మంటూ మూగుతున్నవి. ఆవుల మూత్రంలో తడిసి ఉన్న గడ్డిని పట్టుకొని పాక శుభ్రం చేయడం, చేతుల నిండా పేడ, కాళ్ళు పేడలో, బనీను పేడలో, మోకాళ్ళు మోచేతులు.

తెల్లని నురుగు, బురసుతోని రుద్దుతున్నా కొద్ది ఇంకెక్కువయితున్నది. పండ్లు తోముకుంటున్నదొరగారి కూతురి వంక విచిత్రంగా చూస్తున్నాడు రాజిగాడు. అంతదృష్టం నాకెప్పుడొస్తుందోఅని కలవరిస్తుంది వాడి మనసు. ఏందిరో అట్ల చూస్తున్నావ్ ఏం సంగతి? కటువుగా అడిగింది చిన్నమ్మ. దొరగారి బిడ్డని చిన్నమ్మ అనడం అందరికీ అలవాటు.

పట్నంల పెద్ద సదువు సదువుకుంటుంది.

చిన్నమ్మ తనకంటె మూడేండ్లు చిన్నదని విన్న తన

## కసి... క... స...

తిరిగి తిరిగి ఇంటికి వచ్చిన తాతయ్య, అమ్మమ్మ, మనవడు ఉసురో అని సోఫాలో కూలబడ్డారు.

తాతయ్య అటు, ఇటూ జేబులు తడుముకుని, "అరే నా కళ్ళజోడు ఏది, పారేసుకున్నానా?" అని వాపోయాడు.

మనవుడు: "లేదు తాతయ్య అది ఇందాక పార్కులో పారేసుకున్నావు" అన్నాడు.

అమ్మమ్మ: "ఒరేయ్! దాన్ని తీసి తాతయ్యకు ఇచ్చి వుండవచ్చు కదా?" అని అడిగింది.

వెంటనే మనవడు, "ఎక్కడ తీయనిచ్చావు, వచ్చిడి కింద తొక్కి పారేశావు కదా, నీవే కావాలని కసిగా తొక్కిపారేసి వుంటావని అనుకున్నాను, అందుకనే గప్...చిప్...గా వున్నాను!"

—ఇ.వి.రమణ

తల్లి అన్న మాటలు గుర్తొచ్చాయి.

నమ్మబుద్ధి కాలేదు. ఈ దొర్సానికి తన తల్లికి మధ్యన ఎంత మాత్రం పొంతన లేదు. తన తల్లి రూపం గుర్తుకు వచ్చింది.

చిన్నప్పుడెప్పుడో పెండ్లయిపోయిన తన తల్లి, ఇంకా పెళ్ళికాని ఈ దొర్సాని భేదం ఎంత ఆలోచించినా ఆ చిన్ని బుర్రకి తట్టలేదు. దొరోల్లు శాన పెద్దోలయినంక పెండ్లి జేస్కుంటరు. మరి మన మందికి ఇంత సిన్న గున్నప్పుడే పెండ్లెందుకే" అంటె.

ఏ ఒక్కరు ఇప్పి శెప్పరు. ఆలోచన సాగుతుంది.

'ఏందిరో తిక్కలేసిపోతావ్, పెండ్లాం యాది కొచ్చినాదిరా, బిరబిర ఈ కోపుల్ని కడుగు' దొర్సాని హుకూం జారీ చేసింది.

'బిడ్డా బట్టల్ని తడుపుకోకు' స్నానం చేస్తున్న బిడ్డకు చెబుతుంది తల్లి. చాకలి ఇయ్యాల మాదిగ మాలోల్ల గుడ్డలు ఉతుకుతడు. ఏర్ల, నెల కొక్కసారి అల్లగ్గాడ చాకలోడే ఉతకాల్సొస్తున్నది' వ్యంగ్యంగ అంటున్నది. నెలలో ఒక్కసారే ఆ దినం పై వోల్ల బట్టల్ని ముట్టుకోడు చాకలి. ఆ దినం ఒర్రె నీటిని ఏ ఒక్కరు ముట్టుకోరు. మయిలంటుకుంటదనుకుంటరు. ఆ దినం తర్వాత ఆ నీళ్లదే మయిలెట్ల పోతదో ఎంత ఆలోచించినా అర్థంకాదు రాజిగానికి.

ఒక పని తర్వాత ఇంకొకటి, ఇంకొక దాన్తరువాత ఇంకొకటి.

'దొరా ఇంటికి పొయ్యొస్త.'

'అగ్గొర ఇంగిడనే ఉన్నావ్, పొయ్యి జల్దిన రా. పోర లంజగొడ్క'

కాళ్ళు గుడిసెకి కదిలినవి.

'మజిగి మల్లన్న దేవుడచ్చిండంట ముత్తిగానికి, దండం పెట్టుకుందారి గద నడుస్' అటుగా వస్తున్న




తండ్రి పురమాయించాడు రాజిగాడ్ని. ఇంటే నిండా మంది నిండిపోయి వున్నరు. ముక్కాలి పీట పెట్టించి, పీట మీద మజిగ మల్లన్న దేవుని బొమ్మ పెట్టించిన్రు పసుపు కుంకుమ ఆ పొల్ల నిండిపోయి ఉంది. ముత్తి గాని కాల్లకి గజ్జెలు గట్టిన్రు, మొలల ఇనుపగొలుసు ఎల్లాడ గట్టిన్రు. తన పక్కన అడెల్లుగాడు, పోచిగాడు గజ్జెలు కాల్లకి గట్టుక్కొని నిలబడ్డరు. మల్లన్న దేవునికి కోపం రానియ్యకుండ ఎండకి అడ్డం గొంగడి పట్టిన్రు.

గొల్ల గంగన్న నుదుట బొట్టు బెట్టుక్కొని, దండం పెడ్తున్నడు.

'రెండు గొర్లు కనపడుకున్నయ్', దేవుడంటున్నడు.

ఆ! ప్రక్కనున్న ఇద్దరి నోల్లనుండి వెలువడింది లయుబద్ధంగా శబ్దం తీరం తీరం తిరిగి జూసినవ్'

ఆ!

ఏ తీరంల కనబడలేదు.

ఆ.

'పది దినాలాగు, మల్లన్న దేవుని మొక్కు, పెద్ద నైవేద్యం ఇస్తనని జెప్పు. తూర్పు తీరం నుండి ఉరి కొస్తయి నీ గొర్లు'

ఆ. ... వంత పాట కొనసాగింది.

ఊరి శావుకారు ముత్తిగాని కాల్లకి దండం పెడ్తుండు.

కిందోల్లకి, పైవోల్లు దండం బెట్టుడు వింతగా కనిపించింది రాజిగాడికి. హోటలోడు ముత్తిగానికి 'ఛాయ్' అందరు తాగే గిలాసుల ఇచ్చినందుకు పెద్ద పంచాయితీ పెట్టించిన ఆ షావుకారు దేవుడనంగనే వానికే దండం బెట్టుడు గమ్మత్తనిపించింది.

గుడి వైపుకు కదలడం ప్రారంభించాడు.

దేవుడంటే అందరికి భయము, భక్తి దేవుని ఒట్టు పెడితే దొంగోడయిన వనికి చస్తడు. మరి ఆ దేవున్ని పెండ్లి చేసుకునే పార్వతులని (జోగినులు) అందరు అట్లెందుకు చూస్తరో అర్థంకాదు. పార్వతులని జూస్తె 'దొరోల్లు కన్ను గొడ్తరు, శావుకార్లు పై పై మంటరు. సాకలోడు అస్తవా అనడుగుతడు, బ్రాహ్మనుల్లు బాగుంటదంటరు. కుమ్మరోడు, కమ్మరోడు, కంప

## వెలయాలు

తాళి లేని బేల అది
నీవు పెట్టిన వెలకు ఆలి అది
నడివీథిన దీప మది
నడవలేని స్వేచ్ఛ అది
ఎందరో మహాత్ములు
నడిరోడ్డున వదిలేసిన
నడకరాని పాప అది.

—శంకర్ అన్నమరెడ్డి

లోడు, మాదిగోడు, మంగలోడు, మాలోడు, దక్క లోడు పార్వతులింటికి కుషి కొరకుషొయ్యొస్తరు ఇది ఇట్లెందుకు? చిన్ని మనసు ప్రశ్నలు చాలా పెద్దవి.

'ఏందేమావా ఎప్పుడచ్చినవ్ బాగున్నవా, అత్తెట్లు న్నదే?' ఇంటికి చుట్టంగా వచ్చిన యెంకట మావని అడిగాడు.

'ఆ బాగున్నగాని నీ అత్తవెయ్యబట్కనే ఈడికి అచ్చుడయ్యింది'

నీ మామకి అల్ల అత్తగారోల్లు అళంమందు బెట్టిం రంటరా'

'అవ్వానె మావ'

'అన్ని సూస్తైతెలుత్తంలేదుర దుక్కలెక్కున్నోడు ఎట్లయ్యిండోసూడు'

తల్లి తన తమ్ముడ్ని చూసి దిగులు పడ్తూ అన్నది.

'చాకలి అడెల్లుగాడు అది ఇరుగుతందుకు కక్క మందిస్తడు అందుకే వచ్చిన' మామ చెప్పాడు.

ప్రతి మంగలారం పక్కూర్ల నుంచి మనుషులు చాకలి అడెల్లు దగ్గరికిరావడం తెలుసు 'అట్లనానె' అంతా అర్థమయినట్లుగా అన్నాడు.

భుక్తాయాసం తీరిన రాజిగాడు గుడిస నుంచి బయటకు నడిచాడు. ప్రపంచమంతా సస్యశ్యామలంగా కనిపించడం మొదలుపెట్టింది.

'ఎలచ్చన్లస్తున్నయుంట ఇన్నావ్‌ర లింగ?'

అవుర పోచిగా ముప్పై నల్పై దినాలు ఇంగ బేఫికర అల్లస్తరు, ఈల్లస్తరు, అల్లతానింత, ఈల్లతానింత సర్కారు సార, బేఫికర్ గుండచ్చు.

పొకెట్లేస్తర్రా, పీపలంటవారా?

'ముందుగాల కొన్ని దినాలు పాకిట్లే, ఎలచ్చన్లు దగ్గరయ్యే కొద్ది పీపలు దిగుతాయి! ఆశగా కళ్ళు మెరుస్తున్నాయి లింగడివి.

'ఈపారి సత్తెంగుందాంర ఎవరెక్కువ పోయిస్తె అల్లకే ఓట్లేద్దాం ఏమంటవ్?'

అవ్వవ్వుర ఇమానంతో నుండాలి.

ఊరిలో పేరు బోసిన త్రాగుబోతుల సంభాషన వింటున్నాడు రాజిగాడు. ఎలచ్చన్లంటె ఏంది? ఎలచ్చ న్లకి, తాగుడికి సంబంధం ఏంది? ఎలచ్చన్లప్పుడు అచ్చే మోటర్లు, మనుషులు తర్వాత ఏమయితరు? అర్థం కాని ప్రశ్నలు.

'అనుమాన్లు గుడికాడ మంది గూడున్నరు ఏందో సూద్దాం పారా' అటు వైపుగా వస్తున్న చిన మల్కడు అన్నాడు రాజిగానితో.

'ఇది వెయ్యిగుంజుడు లెక్కనేరో'

'అదంటె నాకు శానిష్టం దాన్ని మారు మనువాడ్త' శంకరి చెబుతున్నాడు.

'నేను గూడ చేసుకుంట ఆడ్ని' అంది పోచవ్వ.


'దమాక కరాబయినాదిర మాలోనివి నీ కంటె చిన్న కులపోల్లు మాదిగదాన్ని మనువాడ్తావ్‌ర' శంకరి తండ్రి కోపంగా అంటున్నాడు.

'మేమేం కులం దప్పిలేము నువ్వనంగనే జేసుకుం టందుకు' ఇంకా కోపంగా అంటున్నాడు పోచవ్వ తండ్రి.

'ఏ ఆపుండిర ఇది అయ్యేడ్దికాదు పోయ్యేడ్ది కాదు మాలోడు, మాదిగోండ్లు ఒకల్లింట్ల ఇంకొకల్లు చేతులు కడుగుడు కాని పని, పంచాయతి అడిగినట్లు జేస్తె అయిపోయే' అందరివి అడిగాడు పోతన్న.

'అవ్వు అట్లే' కొందరన్నరు.



అందరి సమ్మతి అదే.

అధ్యక్ష స్థానంలో వున్న పోతన్న శిక్ష ప్రకటించాడు.

'ఈ దినం సర్కారోల్ల సార అందరికి పోయించాలి శంకరి. మల్లీసారి శంకరి పోచవ్వలు కలిసినట్లు కన్పిస్తె ఊర్ల నుండి ఎల్లగొడ్తరు ఆడ్ని'

'అవ్వవ్వ అట్లే కానియ్యండి' అందరన్నారు.

అందరి మనసు కొద్ది సేపట్లో రాబోయె సారాని గురించి ఆలోచిస్తుంది.

కిందోల్లందర్ని సర్కారోల్లు అరిజనులని పిలుస్తుంటె మరి మా మందిల మాకే బేధాలేంది? ప్రశ్న.

ముసలోల్లు అట్లంటరు నాకెందుకు తియ్యి, పనికి పోవడం గుర్తుకు వచ్చింది రాజిగానికి.

'ఎనిమిదిలకి పోలేదు అప్పుడే సిగరెట్లు కావాల్సొచ్చి నాయిరా నీకు' దొర అరుపులు వినిపిస్తున్నాయి బయిటికి.

'మల్లీసారి తాగుతావ్?'

'లే బాపు నేన్దాగ, నన్ను గొట్టకు' ఏడుస్తూ బతిమాలుతున్నాడు చిన్న దొర.

ఆడీసారి తాగనంటుండు గద అదిలిబెట్టు ఇయ్యాల్టిల్ల ఆనెవ్వాల పడ్డవేంది' దొరవి దొర్సాని సమాదాన పరుస్తున్నది.

ఇదేంది ఇల్లు మన్న దసర పండుగనాడు దొరోరు ఇస్తరేసి కడుపునిండ బువ్వపెట్టి, బీడీల కట్ట, ఒక సర్కారి పాకీటిప్పించిండు సంవత్సరానికి తన జీవితంలో ఒకసారి జరిగే వేడుక గుర్తుకు తెచ్చుకున్నాడు రాజిగాడు.

ఆయన కొడుకు కంటె చిన్నోన్ని నాకు బీడీలు, పాకీటిప్పిచ్చి చిన్న దొర సిగిరేటు తాగిండంటె ఇట్ల కొడ్తడెందుకు.

'పొలం పొయ్యేడ్డి లేదా ఈడ నిలబడ్డప్ నీగ్గాడ కావాల్నా' అడుగుతుంది దొర్సాని.

'పోత పోత' భయంగా కదిలాడు.

'పొలాలన్ని పెద్దోల్లకి, చేన్లు చిన్న కులపోల్లకి అట్లెందుకయితది' ఇంకో ప్రశ్న.

మళ్ళీ యాంత్రికంగా సాగే శరీరం.

చండాలపోడు నన్ను తగిలిండు, మయిల పోగొట్టుకుంటందుకు ఈ పూట తానం చెయ్యాల్సొచ్చింది, మడి బట్టలతో ఉన్న బ్రామ్మన్డు అంటున్నాడు తన మిత్రుడితో.

ఆ బ్రామ్మన్డే మొన్న పోచమ్మని గుడిసెలోకి పిలవడం తన కళ్ళారా చూసాడు, ఈ మయిల చండాల పోల్లని అంటుకుంటే అన్తదనుకునేటోడు అదెట్ల జేసె? ఆడోల్లని తగిలితె మయిల తగులదా?'

అర్థంకాని ప్రశ్న.

అదే పద్ధతిలో సాయంత్రం.

తాగిన మైకంలో అమ్మా, అయ్యల కొట్లాట ఆ రాత్రి.

నిదురపోయే ముందు మళ్ళీ వకసారి రోజు పూర్తిగా నెమరువేసుకుంటున్నాడు రాజిగాడు.

నిన్నా, మొన్న అంతకు ముందెప్పుడో ఒకరోజు గడిసినట్టుగా ఈ రోజు కూడా.

నిన్నా, మొన్నా మనసులో మెదిలిన ప్రశ్నలే మళ్ళీ వకసారి.

జవాబు కన్పించదు వాటికి.

గుర్తుకు వచ్చిన రేపు బాధ కల్గించింది రాజిగాడికి.

'అదెల్లు పోచమ్మ, మల్కా, మైసమ్మ, ముజిగె మల్లన్న దేవుడా రేపు సూర్యుడ్ని రాకుండ జూడు, కోడి పుంజుని ఖుాయనియ్యకు, ఈ చీకటి ఇట్లనే ఉండాలి' కోరుకుంటున్నాడు నిద్రలోకి జారుకుంటూ రాజిగాడు. ●

### ఫ్యామిలీ ఫోటో

టి.వి.లో తప్పిపోయిన కుర్రాడి ఫోటో చూపించడానికి ఆ తండ్రి, కుర్రాడిని ఎత్తుకున్న ఫ్యామిలీ ఫోటోను పట్టుకు వచ్చాడు.

ఇంతకంటే మాకు టి.వి.లో నటించే ఛాన్సు వస్తుందో రాదో మొత్తం ఎడిట్ చేయకుండా ప్రకటించండి సార్ అని ప్రాధేయపడ్డాడు.

—ఇ.వి.రమణ


నాణ్యత, పొదుపు మరియు మన్నికకు
ఆనంద్ బ్రాండ్ పి.వి.సి పైపులనే వాడండి

పి.వి.సి. క్రిషి డెలివరి ట్యూబులు


పి.వి.సి. ట్రాన్స్‌పరెంట్ ట్యూబులు


పి.వి.సి. సక్షన్ హోస్ పైపులు


పి.వి.సి. ఎలక్ట్రికల్ మరియు వాటర్ పైపులు


Mfgs: SREE VENKATESWARA PLASTIC INDUSTRIES
KONTHAMURU-533103, RAJAHMUNDRY, A.P.
తయారుచేయువారు:
శ్రీ వెంకటేశ్వరా ప్లాస్టిక్ ఇండస్ట్రీస్
కొంతమూరు - 533103, రాజమండ్రి. ఫోన్స్: ఫ్యాక్టరీ-3581, రెసిడెన్స్-5934.